క్లుప్తంగా

పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ క్రిష్టఫర్

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దని డిప్యూటీ డీఈఓ క్రిష్టఫర్ సూచించారు. శనివారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఏవైనా తప్పులు జరిగితే ఉపాధ్యాయులు, విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మండలంలో గతేడాది జరిగిన సంఘటన దురదృష్టకరమని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీవిద్య

బేతంచెర్ల: వలసల నివారణకు చేపట్టిన ఉపాధి హామీ పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ శ్రీవిద్య సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామంలో జరుగుతున్న చెరువు పూడిక తీత, పండ్లతోటల పెంపకం పనులను ఆమె పరిశీలించారు. రూ.257 వేతనం పడేలా పనులు చేయాలన్నారు. మార్చి 30లోపు ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, ఈసీ సుబ్బానాయక్, ఎఫ్ఏ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంతాల శుభ్రత పాటించాలి



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ దంతాల శుభ్రత పాటించాలని, రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా బ్రస్ చేయాలని శేషారెడ్డి సీహెచ్‌సీ దంత వైద్యులు వెంకటేష్ సూచించారు. శనివారం పట్టణంలోని ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం నసీమా భాను ఆధ్వర్యంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. పళ్లు తోముకునే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ మూడు నెలలకు బ్రష్ మార్చాలని, సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు.


వర్షానికి దెబ్బతిన్న ఉద్యాన పంటలు



దెబ్బతిన్న అరటి తోటను చూపిస్తున్న రైతు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. జలదుర్గం, మెట్టుపల్లి, ఊటకొండ తదితర గ్రామాల్లో దాదాపు 30 హెక్టార్లలో అరటి నేలకొరిగింది. జలదుర్గం గ్రామంలో 11 హెక్టార్లలో ఉల్లి, ఆరు హెక్టార్లలో పూల తోటలు వర్షానికి దెబ్బతిన్నాయి. ఈ తోటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారిణి కళ్యాణి దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రైతులు నష్టపోయిన విషయాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

అమ్మవారి ఆలయానికి విద్యుత్ కాంతులు



విద్యుద్దీపాలతో వెలుగుతున్న ఆలయం

కొలిమిగుండ్ల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అంకిరెడ్డిపల్లెలోని సుంకులమ్మ ఆలయం విద్యుద్దీపాల కాంతులతో వెలిగిపోతుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి శనివారం అమ్మవారి ఆలయంతో పాటు చెట్టుకు రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించారు. పండుగ మొదలుకొని కొన్ని రోజుల పాటు భక్తులు పూజలు నిర్వహిస్తారు.

‘ఉద్యాన’ రైతన్నకు బాసటగా!

- దిగుబడులు నిల్వకు కలెక్షన్ సెంటర్లు నిర్మాణం
- ఒక్కో యూనిట్‌కు 75 శాతం సబ్సిడీ అందజేస్తున్న ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



కొలిమిగుండ్లలో నిర్మాణంలో ఉన్న కలెక్షన్ సెంటర్

కొలిమిగుండ్ల: వ్యవసాయ రంగం అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తుంది. పెట్టుబడి సాయం అందజేస్తున్న ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, ఉచిత బీమా తదితర పథకాలు అందజేస్తుంది. అదేవిధంగా లాభసాటి సాగుపై ఆర్బీకేల సిబ్బంది రైతులకు సూచనలు అందజేస్తూ చైతన్న పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యానవన సాగును ప్రోత్సహిస్తూ రైతన్నకు బాసటగా నిలుస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. పండ్లు, కాయగూరల గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకునేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ (పంట సేకరణ కేంద్రాలు) ఏర్పాటు చేస్తుంది. జిల్లాకు 60 కలెక్షన్ సెంటర్‌లు మంజూరు కాగా ఇప్పటి వరకు 28 చోట్ల పనులు జరుగుతున్నాయి. కొలిమిగుండ్ల, జూపాడుబంగ్లాలో కేంద్రాల నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు యూనిట్లు పొందే అర్హత కల్పించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి ఉద్యాన శాఖ నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కో యూనిట్ వ్యయం రూ.15లక్షలు కాగా రైతుల వాటా రూ.కేవలం రూ.3.75 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.11.25 లక్షలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుంది. కొలిమిగుండ్లలో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం స్థలం మంజూరు చేయగా కేంద్రం నిర్మాణం చివరి దశలో ఉంది. కొలిమిగుండ్ల రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 200 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.

తీరనున్న ఇబ్బందులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యాన పంటలపైపు మొగ్గు చూపుతున్నారు రైతులు. ఏడాదికేడాది ఉద్యాన పంటల సాగు పెరుగుతుంది. చీని, మామిడి, నిమ్మ, బొప్పాయి, అరటి తదితర పండ్లతోపాటు కూరగాయలు, తోట కూరల సాగు పెరుగుతోంది. జిల్లాలో అరటి 9576 ఎకరాలు, నిమ్మ 2, 807 ఎకరాలు,చీని 1,254 ఎకరాలు, మామిడి 11,649 ఎకరాలు, బొప్పాయి 154 ఎకరాలు, జామ 657 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా. అదేవిధంగా కాయగూర, తోటకూర తదితరాల సాగు దాదాపు 10,780 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పంటల దిగుబడుల సమయంలో సరైన ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. దిగుబడులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపడుతోంది. కలెక్షన్ సెంటర్లలో రైతులు పండించిన కూరగాయలు, పండ్లు తదితర వాటిని నిల్వ చేసుకొని ధర పలికిన సమయంలో మంచి మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. దిగుబడులు గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకొని మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకోవచ్చు. దీంతో గతంలో పడిన ఇబ్బందులు తొలగనున్నాయి. 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్ నిర్మించి రైతులకు అనువుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఇక నష్టాలు ఉండవు



ఉద్యాన పంటల దిగుబడుల సమయంలో ధరలు అనుకూలించక చాలా ఇబ్బందులు పడ్డాం . తప్పని పరిస్థితుల్లో నష్టానికే అమ్ముకున్నాం. దిగుబడులు నిల్వ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇకముందు నష్టాలు దాదాపు ఉండవు. ప్రత్యేకించి కూరగాయాలు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు బాగుంటుంది.
– ఓబులేసు, రైతు, మదనంతపురం

ప్రభుత్వ సహకారం అభినందనీయం



రైతులకు అందరికీ అందుబాటులో రవాణ సౌకర్యం ఉండేలా కలెక్షన్ సెంటర్ నిర్మిస్తున్నాం. సెంటర్ పనులు పూర్తికాగానే ప్రారంభిస్తాం. గ్రూపు సభ్యుల సహకారంతో పాటు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ కల్పించడంతో కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చాం. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సహకారం అభినందనీయం.
– నాగేశ్వరరెడ్డి, రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు

కలెక్షన్ సెంటర్‌లు ఉపయోగకరం

ఉద్యాన పంటల ఉత్పత్తుల నిల్వ, గ్రేడింగ్, మార్కెటింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయనున్న కలెక్షన్ సెంటర్‌లు రైతులకు చాలా ఉపయోగకరం. కొలిమిగుండ్ల, జూపాడు బంగ్లాలో నిర్మిస్తున్న సెంటర్లను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకొస్తే మరిన్ని మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపు

కోవెలకుంట్ల: మండలంలోని గ్రామాల్లో కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్‌కు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక తెలిపారు. శనివారం ఆమె విలేకరలతో మాట్లాడుతూ 20న మండల కేంద్రం కోవెలకుంట్ల నాల్గవ గ్రామ సచివాలయంతోపాటు రేవనూరు, లింగాల గ్రామాల్లోనూ ప్రత్యేక క్యాంప్ ఉంటుందన్నారు. అదేవిధంగా 21వ తేదీన కోవెలకుంట్ల-2, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, 27న కోవెలకుంట్ల-3, బిజనవేముల, వెలగటూరు, 28న కోవెలకుంట్ల-5వ గ్రామ సచివాలయం, 29న గుళ్లదూర్తి, పొట్టిపాడు, సౌదరదిన్నె, అమడాల, గుంజలపాడు గ్రామాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపు ఉంటుందన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా చేస్తారన్నారు. మిగిలిన వారు రూ. 100 సరీ్వస్‌చార్జ్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ



కమిషనర్ రమేష్ బాబు

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు దారులు ఈనెల 31 వ తేది లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు శనివారం తెలిపారు. ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు నగర పాలక, మున్సిపాల్టీలలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపు విషయంలో బకాయిలు, వడ్డీని వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా మాఫీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతోసహా ఒకేసారి ఈనెల 31వ తేదీలోపు చెల్లించినట్లయితే వారికి వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు



ఎగ్జామ్స్ స్పెషల్ బస్సు

డోన్ టౌన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే గ్రామీణ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడు ఎగ్జామ్స్ స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ప్రారంభంమైన ఇంటర్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించని నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలు చేరుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డోన్, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల నుంచి ఎగ్జామ్స్ స్పెషల్ పేరుతో బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అంబేడ్కర్ గురుకుల, మోడల్ స్కూల్ పాఠశాల కేంద్రాల వరకు బస్సు సర్వీసు ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను పెంచే అవకాశం ఉందన్నారు. త్వరలో జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎం వివరించారు.

విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలి



వాలీబాల్ క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేసిన కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు, వైఎస్సార్‌సీపీ బనగానపల్లె నియోజకవర్గ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను కాటసాని ఓబులరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి మొత్తం 22 టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడారంగానికి ప్రాధాన్యతనిస్తున్నారని, ఆ దిశగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పలు క్రీడలను నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. విజేత జట్లకు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వరుసగా రూ.30,రూ.20, రూ.10వేలు చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా క్రీడాకారులకు టీ షర్ట్సను కాటసాని ఓబులరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ వాలీబాల్ క్రీడాకారుడు, రిటైర్డ్ ఉద్యోగి కరిమూల్లా, కాటసాని యూత్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, కోనేటి దుర్గా, అత్తార్ అఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియదర్శిని పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక ప్రియదర్శిని పాఠశాల వార్షికోత్సం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం పార్థసారథి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్య ఎంతో కీలకం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ చేసిన నాటిక ఆలోచింపజేసింది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, రసూల్ బేగం, శశికళ, ఈశ్వరమ్మ, భాగ్య, మమత, రాజేశ్వరి, మధు, చంద్రకళ, సురేఖ, షహనాజ్, విద్యావతి తదితరుల పాల్గొన్నారు.

ముగిసిన సామూహిక గజగౌరివ్రతం



మట్టితోతయారు చేసిన అమ్మవారి విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని కొండపేట వెలసిన శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలిల ఆధ్వర్యంలో కొనసాగిన సామూహిక గజగౌరివ్రతం శనివారం ముగిసింది. ముందుగా ఆర్యవైశ్య మహిళలు మట్టితో తయారు చేసి గజగౌరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని యాగంటి పల్లె రహదారిలోని ఎస్సార్‌బీసీ కాలువలో నిమజ్జనం చేశారు. ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండేందుకే వ్రతం నిర్వహించినట్లు ఆర్యవైశ్య మహిళలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు పీఎస్ సత్య నారాయణ, సెక్రటరీ బచ్చు మధు సూదన్, ట్రెజరర్ కాసుల జంగంశెట్టి, అధ్యక్షుడు కేతేపల్లె శివచంద్రయ్య, కేతేపల్లె శివరాజ్, ఆర్యవైశ్య మహిళా సంఘం మహిళలు బండారు లలితా, విజయశాంతి, నూకల నిర్మాల, నూకల వాసంతి, సునిత, సుప్రియ, ప్రతిమ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

నంద్యాల: ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి, వారి సమస్యల సాధనకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఎంవీ రామచంద్రారెడ్డిని ఏపీయూఎస్‌ఎంఏ, పీఆర్‌టీయూ, ఇతర ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీసంకల్ప్ పాఠశాలలో సన్మానించి అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, ఉపాధ్యాయులు తనకు మద్దతు పలికి విలువైన ఓట్లు వేసి ఘన విజయం అందించారని, వారికి రుణపడి ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల సాధనలో చిత్తశుద్ధితో, నిజాయితీతో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు సుధాకర్, బాలాజీ, వెంకటస్వామి, పీఆర్‌టీయూ, ఏపీయూఎస్‌ఎంఏ, సంఘాల నాయకులు వెంకటరాముడు, దస్తగిరి, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో షార్ట్ ఫిలిం షూటింగ్

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఊరంతా ప్రేమ కథ అనే షార్ట్ ఫిలిం షూటింగ్ శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి హాజరై క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో తీసిన సినిమాలు సూపర్ హిట్ అయ్యాయని గుర్తు చేశారు. డైరెక్టర్ జంబలయ్య మాట్లాడుతూ పూర్తిస్థాయి షూటింగ్ త్వరలో మంగంపేట గ్రామంతోపాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేపడుతామన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు సల్మా, సురేష్, సుభాన్, ప్రవీణ్, మహేంద్ర, చంద్రశేఖర్, డి రాజు, అమ్మాజీ రామ్మోహన్‌శర్మ, ప్రతిష్, ఎంజె హుస్సేన్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ నాయకుడు మృతి

బేతంచెర్ల: పట్టణంలోని బజారు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకుడు సయ్యద్ ఖాశీం మృతి చెందాడు. ఈ మేరకు శనివారం సయ్యద్ ఖాశీం మృతదేహానికి సీఐటీయూ, సీపీఎం, హమాలీ యూనియన్ నాయకులు ఎల్లయ్య, ఈశ్వరయ్య, హుస్సేన్ బాషా, కావేటి రాజబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : స్థానిక పోస్టు మెట్రిక్ బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు కోరుతూ శనివారం బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసయ్యకు పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పవన్, నాయకులు రాఘవేంద్ర,జయరాముడు వినతి పత్రం అందజేశారు. వసతి గృహంలో నీటి సమస్య, బాత్ రూమ్, పారిశుద్ధ్యం సమస్యలు ఉన్నా వార్డెన్ పట్టించుకోవడం లేదని నాయకులు నరసయ్య దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలోని 29వ క్లస్టర్ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామలమ్మ భర్త రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ ఏస్తేరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు యాకోబ్, సత్యం, జాకబ్, యోబ్ తదితరులు రామకృష్ణ మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అందజేసిన రూ.5 వేలను బాధిత కుటుంబానికి వారు అందజేశారు.

కిటకిటలాడిన మద్దిలేటయ్య క్షేత్రం



మద్దిలేటి స్వామి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు

- ఒకే రోజు రూ.17,14,000 ఆదాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఫాల్గుణ మాస ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలలతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కళ్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ.17,14,000లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

ఆలయ పునర్నిర్మాణానికి రూ. లక్ష విరాళం

స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన కుంచె తిమ్మారెడ్డి, మధుసూదన్ సాయినాథ్‌రెడ్డి రూ.1,00,116 లక్ష విరాళంగా ఈఓ, చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించాలి



విద్యార్థినులకు ప్యాడ్‌లను అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధిస్తే భవిష్యత్ చదువులకు ఎంతో ఉపయోగకరమని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు అన్నారు. పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం సమితి అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి ఆర్థిక సాయంతో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థునులకు ప్యాడ్స్ అందజేశారు. స్వామివేకానంద జీవిత చరిత్రతోపాటు పది పరీక్షలు రాసేవిధానాన్ని మోటివేటర్ సాయినాథ్ విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీత, మ్యూజిక్ టీచర్ రామలక్ష్మమ్మ, తెలుగు టీచర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మేజర్ గ్రామ పంచాయతీ సిమెంట్ నగర్ గ్రామంలోని 1వ సచివాలయంలో శనివారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద 113 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, గ్రామ వైఎస్సార్ నాయకులు, యాకోబ్, సత్యం ప్రారంభించారు. నంద్యాల కంటి వైద్యులు హనీఫ్ వృద్ధులకు కంటి పరీక్షలు చేసి యిన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తామన్నారు.

మెరుస్తున్న లింక్ రోడ్లు !



నాడు తిరునాం పల్లె - కొత్త బురుజు రోడ్డు దుస్థితి (ఫైల్)



నేడు కళకళలాడుతున్న అదే రోడ్డు

డోన్: మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి ప్రధాన రహదారుల నిర్మాణం చేపడుతోంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చొరవతో అన్ని రహదారులు సరికొత్త రూపును సంతరించుకొని కళకళలాడుతున్నాయి. ఇందులో భాగంగా లింకురోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారుల నుంచి మెటల్ రోడ్లుతో లింక్ గల అనేక గ్రామాల వరకు తారు రోడ్లు వేస్తున్నారు. మండలంలోని తిరునాం పల్లె గ్రామ క్రాస్ రోడ్ నుంచి కొత్రాయి గ్రామం మీదుగా 3 కిలోమీటర్ల మేర రహదారిని రూ.6కోట్లతో నిర్మించారు. దీంతో కొత్త బురుజు నుంచి ప్యాపిలి మండలంలోని అనేక గ్రామాలతో పాటు కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు సకాలంలో ప్రయాణించే అవకాశం కలిగింది. ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రోడ్లు ప్రస్తుతం మెరుస్తుండడంతో ఆయాగ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.